కథా నిలయం
4818
శ్రీకాకుళం



# పదమూడు మెట్లు

ఎందుకనో ఆ రోజు అందరి కంటె ముందుగానే తెల్లారింది. కటకటాల్లో ఉండేవారికి ఓ గడియ ముందు తెల్లారినా, ఓ జాము ఆలస్యంగా పొద్దు పోయినా అంతా ఒకటే. ఇక్కడ తెలిసేదల్లా ఒకటే-వెలుగు ఉంటే పగలు, చీకటైతే రేయి.

తిథి వార నక్షత్రాల్లేవు. పున్నమి లేదు. అమావాస్యలేదు. ఉన్నదంతా ఒకటే ఆలోచన.

అదే ... ఈ బతుకు ఎప్పుడు తెల్లవారుతుందో ?

తనకే కాదు, ప్రపంచానికి కూడా తెల్లవారినట్టుంది.

ఎక్కడో దూరంగా, ఈ రాతిగోడలకు, మానవుడు నిర్మించిన ఈ చట్టాలకు దూరంగా స్వేచ్ఛగా తియ్యని కోయిలకంఠం. కోయిల కూస్తూందంటే, కుహూ కుహూమని ఆలపించిందంటే, ఈ జగతికి మళ్ళీ వసంతం వస్తూందన్న మాట.

తన జీవితంలో కూడా ఎప్పుడో, ఎన్నో, ఎన్నో యుగాల వెనక వసంతం వచ్చినట్టు గురుతు.

ఏమైందో ఆ వసంతం ?

ఇన్ని యుగయుగాల గాథ ఏమైందో ?

ప్రశ్నించడానికి కూడా శక్తిలేని మానసిక స్తబ్దత. ఆలోచనల అలజడిలో గతి తప్పిన హృదయవేగం. లక్షలాది ప్రశ్నలకు సమాధానం శూన్యం... కొత్వాల్లో గంటలు కొదుతున్నారు. అప్పుడే ఆరు గంటలైంది. తలుపులు తీసిన చప్పుడు, ఇనపనాడాల బూట్ల చప్పుడు, బానిసత్వంలో క్షణకాలం స్వేచ్ఛ పొందిన ఖైదీల కోలాహలం, అంతలోనే ఆజ్ఞలు, అంతలోనే గర్జనలు, అంతలోనే నిశ్శబ్దం.

అందరి దృష్టి అటువంకనే. ఈ చాయలకు వచ్చేవారు లేరు. ఇక్కడి బ్రతుకులు తలిచేవారు లేరు.

బానిసత్వంలో అంతకన్న బానిసత్వం, భయంకర బానిసత్వం. ఈ దిక్కు చూడటానికి అందరికి ఏదో చెప్పలేని భయం. కానీ, తనకు భయం లేదు.

ఆజన్మాంతం ఇదీ తనకు స్వగృహం.

గృహప్రవేశం నాడు ఆ గదిపై నున్న అక్షరాలు చూడగానే మనస్సు ఒక్కక్షణం జలదరించిన మాట వాస్తవం.

ఒక్క భాషలో చెబితే చాలదని కాబోలు, రెండు మూడు భాషల్లో వ్రాసి ఉంది. ఇంగ్లీషు భాషలో వ్రాసిన పెద్దపెద్ద అక్షరాలు ఒకటికి పదిసార్లు తను చదువుకున్నాడు.

'కండెమ్డ్ సెల్స్' మూడే మూడు గదులు. మధ్యగది తనది. అటూ ఇటూ ఎవరున్నారో తనకు తెలియదు.

కానీ, తను వచ్చేసరికి చాలా బడలికతో నలిగి, వేదనతో క్రుంగి కృశించి ఇటువైపు సాగివచ్చాడు.

తనకు సుస్వాగతం. . . నిశ్శబ్దం.

ఆక్షణం నుంచి తను అందరికాన్నా భేదం. అన్నిటికీ దూరం. అనుక్షణం గుర్తుకు వచ్చేదల్లా, అనుక్షణం మనస్సును మథనం చేసేదల్లా ఒకే ఒక్క మాట - ఈ ఒక్కమాట తన ఒక్కడికి మాత్రమే వెయ్యి పిడుగుల శబ్దంతో ఆ నాడు, ఈ నాడు కూడా వినిపిస్తూనే ఉంది. . .

ఏమిటి ? ఆశ్చర్యంగా ఉందే!

ఈ విశాల ఏకాంత సౌధం వైపు ఎవరివో కర్కశ పదధ్వనులు వినిపిస్తున్నాయే ! ఏ సందేశాన్ని తీసుకు వస్తున్నాయో ? ఏ శిక్షను అమలు పరచడానికి వస్తున్నాయో ?

శిక్ష !

మరణ శిక్ష ! ఆలోచన ఆగింది. మళ్ళీ మనస్సు ప్రశ్నించింది.

వ్యవధి తీరిందా ?

పదధ్వనులాగిపోయాయి. మెత్తని మనస్సు కర్కశ కంఠంతో పిలిచింది ... ఖైదీ !

ఆ పిలుపు తనకు వెయ్యి వీణెలు మీటినట్టనిపించింది. తోటి మానవుని కంఠం విని ఎంత కాలమైంది ! తోటి మానవుడు తనని పలకరించి ఎంతకాలమైంది !

ప్రయత్నం చేసి, గుర్తు తెచ్చుకుంటే గానీ, గుర్తుకు రావడం లేదు, తనుకూడా మానవుడేనని.

ఈ సారి కంఠం ఇంకా కర్కశంగా గర్జించింది. మళ్ళీ అదేమాట. ఖైదీ!

అడుగులో అడుగు వేసుకుంటూ, కటకటాల దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు.

ఎందుకు పిలిచారు ? అని ప్రశ్నించలేదు.

జైలరు నెమ్మదిగా అన్నాడు : 'మీ వకీలుగారు వచ్చారు'.

వకీలుగారు ?

ఎందుకని ?

మరచిపోయిన దోవగుండా నడుచుకుంటూ వెళ్లాడు. తను ఎక్కడికి వెళ్ళినా రాజమర్యాదలే.

ఎటు కదలినా సపరివారంగా కదలవలసిందే !

వకీలుగారు ఒక్కడూ ఒంటరిగా కూర్చున్నాడు. ఏదో, చాలా పోగొట్టుకున్నట్టు కనిపిస్తున్నాడు. తనని చూసి నవ్వడానికి ప్రయత్నం చేశాడు.

'బాగున్నావా, రఘూ ?' అని ప్రశ్న వేశాడు.

రఘూ !

తను కాకుండా ఈగదిలో ఇంకెవరన్నా ఉన్నారా అని ఒక్కసారి వెనక్కి తిరిగి

చూశాడు. అంతలోనే పీడకలలాగా గుర్తుకు వచ్చింది, స్వేచ్ఛాజీవిగా ఉన్నప్పుడు ఈ ఖైదీ పేరే 'రఘు' అని. ఈ నాలుగు సంవత్సరాలుగా చిత్రగుప్తుని చిఠాలో కూడా ఆపేరు చెరిపేశారు. ఇప్పుడు మిగిలిందల్లా ప్రాణం లేని మూడంకెలు. మూడు, తొమ్మిది, మూడు.

ఆఖరిసారిగా తన పేరు మరిచిపోయే ముందు జైలరుని తను అడిగాడు - 'ఇక్కడ ఇన్ని వేల మంది ఉండగా, ఇంత చిన్న సంఖ్య ఇచ్చారేం నాకు?' అని.

జైలరు నవ్వలేదు. తనని మందలించనూ లేదు !

నెమ్మదిగా, జాలిగా అన్నాడు : 'ఈ జైలులో ఇంతవరకు మరణశిక్ష అనుభవించడానికి వచ్చిన వారి సంఖ్య మూడు వందల తొంభైమూడు - నీతో సహా'.

ఆ వాక్యం అర్థం కావడానికి తనకి క్షణకాలం పట్టింది.

తను ఈ సారి ఇంకో ప్రశ్న వేశాడు. రెండే రెండు మాటలు.

'అందరూ మరణించారా ?'

ఈ సారి చిరునవ్వు నవ్వడం ఆయనవంతు.

పది, పదిహేను మంది మినహా మిగతా అందరూ బ్రతికే ఉన్నారు.

ఒక్కక్షణం ఆశ కలిగింది.

'అయితే, నేనెవరి పక్షమో ?'

'అదీ .... అదృష్టం నిర్ణయిస్తుంది' అన్నాడు జైలరు.

అదృష్టం!

తన జీవితంలో ఆ మాటకర్థమే లేదు.

ఎప్పుడూ తనకు అదృష్టం ఆమడ దూరమే.

సిరి ఉంటే ఏం? సంపద ఉంటే ఏం? మనస్సుకి శాంతి లేనినాడు ఈ బ్రతుకుకి ఫలితమేమిటి ?

చిన్ననాడే తను చూస్తుండేవాడు - తన స్నేహితులని, స్నేహితురాళ్ళని వాళ్ళ తల్లిదండ్రులు ఎంతో గారాబం చెయ్యడం, ముద్దు చెయ్యడమూను.

బారసాలనాడు పెట్టిన పేరేదైనా తన తల్లిదండ్రులు పెట్టిన ముద్దు పేరు నష్ట జాతకుడు, దరిద్రుడు. ఆ పేర్లు వింటూంటే తనకు భయం కన్న ఆశ్చర్యం ఎక్కువ వేసేది. అందరి ఇళ్ళలో కన్నా తన ఇంట్లో ఎక్కువ సిరి సంపదలున్నాయి. ఎక్కువ మంది నౌకర్లు, చాకర్లు ఉన్నారు. అందరి ఇళ్ళలో కన్నా ఎక్కువ అశాంతి ఉంది. ఎక్కువ దుఃఖం ఉంది. ఎక్కువ ద్వేషం ఉంది. ఎక్కువ బాధ ఉంది. వీటన్నిటికి కేంద్రం తను; లక్ష్యం తను.

తను నిత్యం దైవాన్ని అర్థించే వరం - ఇక్కడినుంచి దూరంగా, చాలా దూరంగా పారిపోవాలి.

ఈ తల్లిదండ్రుల నుంచి ఎంతో దూరంగా పారిపోవాలి. ఒకటికి రెండుసార్లు

ప్రయత్నాలు జరిగినాయి. కానీ, ఫలితం దక్కలేదు. భయంకరమైన దండన మాత్రం మిగిలింది.

ఎందుకో ప్రపంచమంటే అంతులేని ద్వేషం. అనుక్షణం తమని ఆడిపోసుకునే ఈ సంఘంమీద పట్టరాని కోపం. తనకి గ్రాహ్యం తెలిసేసరికి ప్రపంచం చెప్పిన పాఠం - తండ్రి జూదరి, తల్లి వ్యభిచారిణి.

మరైతే తనో ? అర్థించకుండా లభించిన వరం. అందుకనే ఆ ఇంటివారికి తన మనుగడే ఒక శాపం.

అనేక పర్యాయాలు తన తల్లి దీవించిన దీవెన అదే - 'ఛస్తే పీడ వదిలిపోయేది'.

నాటి ఆ సిరులేమైనాయో ? ఆ సంపద లేమైనాయో ?

తండ్రి దూరమయ్యాడు. తరవాత అదృశ్యమయ్యాడు. తల్లి వ్యభిచారిణేకాదు, బికార కూడా అయింది.

ఒకనాటి రాత్రి తనకి కలత నిద్దర్లో వినిపించినవి ఎవరివో గుసగుస మాటలు, ఎవరో కదిలిన శబ్దం. కన్ను తెరచి చూస్తే మిగిలినవి, తను, నిశ్శబ్దం.

ఆ నాటికి ఈ నాటికి తెలియదు - తన తల్లి ఏమైందో ! అనుక్షణం తనని ద్వేషించి, తన పసి మనస్సుని రాచి రంపాన పెట్టి నరకయాతన పాలు చేసిన తల్లిని తలుచుకుంటే - తనకు ఎందుకనో కన్నీరు తిరిగింది.

కన్నీరు, తనకే కాదు, వకీలు గారి కళ్ళలో కూడా కనిపించింది.

'అయాం సారీ, రఘూ! నేను కూడా ఓడిపోయాను'. అన్నారు వకీలుగారు.

'ఎందుకని?'

ఆయనేం మాట్లాడలేదు.

తన చేతిలో ఉన్న కాగితాన్ని ఖైదీకి ఇచ్చారు.

సెక్షను త్రీ నాట్ టు ఐ. పి. సి. ప్రకారం డిస్ట్రిక్టు జడ్జిచే విధించబడిన మరణశిక్షను హైకోర్టువారు ఖాయపరచగా, దానిపై ముద్దాయి సుప్రీం కోర్టుకు చేసుకున్న అప్పీలును కొట్టివేస్తూ, మరణశిక్షను ఖాయపరుస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్టు.'

మరణశిక్ష ఖాయపరచడమైంది.

ఏనాడో మరణించిన తనకు మరణశిక్ష ఏమిటి?

అంతులేని నవ్వొచ్చింది. ఆపుకోలేనంత ఆవేశం కలిగింది. అన్యాయం, అన్యాయం అని హృదయం ఆక్రోశించింది.

కాగితం మరొక్కసారి చూశాడు. ఆ గదిలో ఉన్న అందరి వంక చూశాడు. తనకి ఏమీ కనిపించడంలేదు. కనిపించేదల్లా ఒక్కటే వాక్యం. వినిపించేదల్లా ఒక్కటే వాక్యం. 'మరణశిక్ష ఖాయపరచడమైంది'.

తనకేనా మరణశిక్ష విధించబడ్డది ?

తనేం నేరం చేశాడని ఈ శిక్ష ?

వకీలుగారేదో చెబుతున్నారు. 'అధైర్యపడకు. క్లెమెన్సీ పిటిషన్ పెడదాం. నాకు చాలా నమ్మకం - నీకు తప్పకుండా న్యాయం జరుగుతుందని.' ఖైదీ ఏం మాట్లాడలేదు. వెనక్కి తిరిగి తన ఏకాంతసౌధం వైపు నడవడం మొదలెట్టాడు.

దూరంగా, అస్పష్టంగా వకీలుగారి కంఠం వినిపిస్తూంది - 'గుడ్‌బై, రఘూ! గాడ్ బ్లెస్ యు!'

తను వెనక్కి తిరిగి చూడలేదు. వీడ్కోలు చెప్పలేదు. ఎందుకంటే, వకీలు గారి పట్ల తనకేం కృతజ్ఞత లేదు. తన మనసులో మసలుతున్న మాట - 'గాడ్ బ్లెస్‌యు!' కోపంతో పాటు నవ్వు కూడా వచ్చింది.

అదృష్ట హీనులతో భగవంతునికేం పని? అందుకనే, ఎన్నడూ ఆయన తనమొర ఆలకించలేదు.

ఆయనే నిజంగా ఉండి, మనుష్యుల కష్ట సుఖాల్లో ఆదుకుంటూ ఉంటే ఇంత అశాంతి, ఇంత ద్వేషం, ఇంత దుఃఖం ఎందుకుంటాయి, ఈ మానవ ప్రపంచంలో ?

కటకటాల తలుపు బంధింపబడింది. బూట్ల చప్పుడు దూరమైంది. తనకు తోడుగా మిగిలింది నిశ్శబ్దం.

ఒకటికి రెండుసార్లు మనస్సు నిలిచింది, ఒక ప్రశ్నపై.

'మరణశిక్ష విధించడానికి తను చేసిన నేరమేమిటి?' ఎంత ప్రయత్నం చేసినా, స్మృతిపథంలో లీలగా, అస్పష్టంగా ఏవేవో స్మృతులు, ఏవేవో ఆలోచనలు.

ఆ నాడు తన కింకా గుర్తే.

తండ్రి ఏమయ్యాడో తెలియదు. తల్లి మాయమైంది. తను ఏమీ కాక పోయినా తనకెంతో కావలసిన వాళ్ళిద్దరి కోసం వాడవాడలా గాలించాడు. దిక్కు దిక్కులా పిలిచాడు. వారి జాడ తెలియబరచమని ఎందర్నో అర్థించాడు.

సహాయానికి బదులు లభించింది తిరస్కారమే, అవహేళనే. కనికరించిన వాళ్ళూ లేరు, కరుణ జూపిన వారూ లేరు.

పైగా అంతా వెక్కిరించిన వాళ్ళే. ఎద్దేవా చేసిన వారే. ఆ క్షణం తనలోని మానవుడు దూరమయ్యాడు. తనకు అండగా నిలిచింది దానవుడే. మానవుణ్ణి హేళన చేసిన సమాజం దానవుణ్ణి చూసి భయపడింది. ఇష్టం లేకుండానే గౌరవ మిచ్చింది.

అందరి అదృష్ట హీనుల కథ లాటిదే తన కథాను. జేబుదొంగతనాలతో అక్షరాభ్యాసం చేశాడు సింగనదొర.

తనలో చురుకు పాలెక్కువ. అందరికన్నా ముందుగానే జేబు దొంగతనాల్నించి బ్యాంకు దోపిడీల దాకా పెరుగుతూ వచ్చాడు. చీకటిలో కరిగిపోవలసిన జేబు దొంగ ప్రపంచాన్నే భయపెట్టేటంత బంది పోటుగా మారాడు.

ఈ ప్రగతి అంతా ఒక దశాబ్దంలోనే.

వద్దనకుండానే సంపద పెరిగింది.

కోరకుండానే ఆశ్రితులెక్కువయ్యారు. ఎందరున్నా, ఏమున్నా, తీరకుండా కొరతగానే మిగిలిపోయింది తీరని కోరిక.

ఎడారి జీవితంలో అంతులేని ఒంటరితనం. ఆ క్షణం నుంచి తను అన్వేషించింది, అర్థించింది ధనికుల ఇళ్ళలోని వజ్రవైఢూర్యాలు కాదు. తన ఒంటరి తనం బాపి ఈ అమావాస్య బ్రతుకులో వెన్నెల తీసుకొచ్చే వ్యక్తి కోసం, మెరుపులా మెరిసింది ; కలలాగా కదలి వచ్చింది; దైవమిచ్చిన వరంలాగా ఎదుట నిలిచింది.

ఆ నాటి నుంచి తన బ్రతుకే ఒక మలుపు తిరిగిందని నమ్మకం కలిగింది. తను బందిపోటు దొంగ, ఆమె వేశ్య. తమ కలయికలో బ్రతుకు ఇచ్చిన శాపాలు తొలగిపోతాయని, దైవమిచ్చిన వరమే మిగిలిపోతుందని, తాము కూడా నిర్భయంగా, నిశ్చింతతో సాటి మానవుల్లాగా బ్రతకగల శుభఘడియ వచ్చిందని తాము రూఢిగా నమ్మారు.

వృత్తికి వేశ్య అయినా పేరు 'సుశీల'. తను బందిపోటు దొంగ. పేరు 'రఘు'.

ఇదే కాబోలు సృష్టి వైచిత్ర్యం! అగ్నిసాక్షిగా కాకపోయినా, దైవసాక్షిగా తామిద్దరు ఏకమైనప్పుడే మనసులు చేసుకున్న వాగ్దానం - ధర్మార్థకామమోక్షములు తప్పి చరించమని కాదు.

ఆమె ఇచ్చిన మాట - ఆ నాటి నుంచి తాను సుశీలనే నని, అతడు చేసిన బాస- ఆక్షణం నుంచి ప్రజలను కొల్లగొట్టనని. సంకల్పం సత్సంకల్పమే. కానీ, ఎదురైంది, తమ జీవితాల్ని మళ్ళీ ఎదురు తిప్పింది ఈ సంఘమే.

ఈ సంఘానికి దూరంగా వెళ్ళి బ్రతుకుదాం, ఈ మానవులు మనల్ని బ్రతకనీయరు అని మనసుకు నిశ్చయం వచ్చింది. కొండలు, కోనలు, అడవులు దాటి మానవుల నుంచి దూరంగా పారిపోవడానికి, విసిగి వేసారి చిట్టచివరకి చేరుకున్నారు నిర్జన ఏకాంతవనానికి.

ఆ క్షణం అనిపించింది - స్వర్గం అంటే ఇదే కాబోలు. స్వర్గం ఇదే అయితే మరి దేవతలేరీ ?

తనకి కనిపించిన ఆఒక్క వ్యక్తే - ముప్పైమూడుకోట్ల దేవతల్లో ఒకడని తాను భావించాడు. అది నిజమని నమ్మాడు.

ఈ శరణార్థులకు ఎంతో ప్రసన్న వదనంతో స్వాగతమిచ్చాడు; ఆశ్రయమిచ్చాడు.

మానవసమాజానికి దూరంగా, ఆ ప్రశాంత వాతావరణంలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. యుగయుగాల నరకంలో ఒక లిప్తకాలం స్వర్గం కనిపించింది.

ఆయన నీడలో తాము చింతలకు, చికాకులకు దూరంగానే ఉన్నారు. రోజూ తను వెయ్యిదేవుళ్ళకు మొక్కుకునే వాడు - మాకు ఈ అదృష్టం చాలు, ఇంతకన్న స్వర్గం మాకు అక్కర్లేదు అని.

కానీ, పీడకలలు దూరం కాలేదు. శాపాలు తీరలేదు. పాదలచాటున దాగిన విషనాగులు బుసలు కొట్టాయి. వెలుగు చూసిన మానవుడు దూరమయ్యాడు. మరచిపోయిన దానవుడు మళ్ళీ ఎదుటికి వచ్చాడు.

కలతనిద్ర నుంచి ఉలిక్కిపడి లేచాడు తను.

నీడలా వెన్నంటి ఉండే సుశీల పక్కన లేదు.

ఏమైంది ?

ఈ ఘోర అరణ్యంలో ఏమైంది ? అనుమానం కన్న తనకు ఆవేదన కలిగింది. వెతుక్కుంటూ వెళ్ళాడు. సుశీల - సుశీల కాలేదు. వెనకటి గుణం మానలేదు. ఎంతటి బలవంతులనయినా ప్రలోభం బలహీనుల్ని చేస్తుంది కాబోలు.

తన దగ్గరేముందని తనను ప్రేమించడానికి ?

జీవితమంతా నిరాశ్రయమే. చట్టం నుంచి అనుక్షణం పారిపోయే దొంగ తను.

తన నీడలో ఆమె మనుగడకు రక్షణ లేదని భావించింది కాబోలు. అందుకనే అంతులేని స్వార్థంతో ఈ పాపపు తలంపు మనసులో మసలనిచ్చింది.

తను భ్రష్టురాలవడమే కాదు, తమకు శరణు ఇచ్చిన దైవాన్ని రాక్షసుడుగా మార్చివేసింది. ఎంతకాలం నుంచి జరుగుతోందో యీ కపట నాటకం!

ఎంత కాలం నుంచి జరుగుతూందో ఈ కుట్ర!

వారి మాటలన్నీ తను వినలేదు. కానీ, విన్న కొద్ది మాటలు చాలు, ఒళ్ళు జలదరించడానికి.

ఆ ప్రేయసీ ప్రియుల సంకల్పం - తనకు త్వరలోనే స్వర్గారోహణం.

తీరని సమస్య అల్లా - మార్గమేమిటా అనే.

కాలకూట విషమా? ఖడ్గమా ?

శుభముహూర్తం కూడా నిశ్చయమైంది. ఇరవై నాలుగు గంటల్లో తనకోసం రథం సిద్ధంగా ఉంటుంది - స్వర్గానికి తీసుకు వెళ్ళడానికి.

హంస లేచిపోయిన మరుక్షణం మట్టిలో పుట్టి, మట్టిలో పెరిగిన ఈ శరీరం మొసళ్ళ పాలవుతుంది.

ఈ విశాల ప్రపంచంలో తను లేననే విషయం భగవంతుని కూడా అంతు చిక్కదు.

ఆ మరుక్షణం నుంచే తామిద్దరూ హాయిగా, ఆనందంగా ఈ వనరాజ్యం ఏలుతూ కలకాలం గడపవచ్చు.

నమ్మకూడదనుకుంటూనే మనస్సు నమ్మింది.

వినకూడదనుకుంటూనే హృదయం విన్నది. జీవితంలో మొట్టమొదటిసారిగా ఈర్ష్య కలిగింది.

'తనది', 'తనవారు' అని ఆలోచన కలిగింది. 'నమ్మకద్రోహ'మనే బాధ కలిగింది.

మానవుడి మాట దానవుడు వినలేదు.

ఆమె మీద నీకేం అధికారం లేదు. తాళి కట్టిన భార్యకాదు. వ్యభిచారిణి. వేశ్య. స్వర్గానికి వెళ్ళినా తన వృత్తి మానదు. మరిచిపో. ఈ నమ్మకద్రోహుల్ని మరిచిపో. ఈ

వెలిసిపోయిన దేవతల్ని మరిచిపో.

ఎలా వెళ్ళడం? ఎందుకు వెళ్ళడం? ఇక్కడ తనది, తన వారంటూ ఏదీ లేదు. తను ఎప్పుడూ ఒంటరివాడే. వెళ్ళిపోవాలి దూరంగా వెళ్ళిపోవాలి. కానీ అమృతంలో విషం నింపుకుని వచ్చింది ప్రణయదేవత, ఆశ్రయమిచ్చిన చేతితోనే గండ్రగొడ్డలి తీసుకు వచ్చాడు దిగి వచ్చిన దైవం.

అమృతం నేలపాలయింది. ఆత్మరక్షణలో గండ్రగొడ్డలి దూరంగా తూలిపడ్డది.

నేల కూలిన దైవం జాలిగా 'రఘూ!' అని అర్థించినప్పుడు, ప్రాణభిక్ష పెట్టమని ప్రార్థించినప్పుడు ఆవేశంలో అంధుడైన తన చేతిలోని గునపం ఆ బలహీనుడి గుండెల్లో గుచ్చుకుంది. భయంకర ఆర్తనాదం! మళ్ళీ నిశ్శబ్దం! వెనుతిరిగి చూస్తే మిగిలింది తను, హంసలేని ఆ జీవి.

మనసు వేసిన మొదటి ప్రశ్న.

సుశీల ఏది ?

ప్రశ్నకు సమాధానం త్వరలోనే దొరికింది.

సుశీల తిరిగి వచ్చింది. ఒంటరిగా కాదు, పోలీసుదళాన్నే వెంట బెట్టుకు వచ్చింది.

తన మాట ఎవరూ నమ్మలేదు. తన మొర ఎవరూ ఆలకించలేదు.

కర్కశంగా తను చెప్పిన నిజంకన్నా, కన్నీటితో సుశీల చెప్పిన అబద్ధాన్నే ప్రపంచం ఎక్కువగా నమ్మింది.

లెక్కలేనన్ని సాక్ష్యాలు, ఆధారాలు దొరికాయి.

ప్రత్యక్షంగా కాకపోయినా, పరోక్షంగానైనా తన దుర్మార్గాన్ని చాటి చెప్పగల వ్యక్తులు అనేకులు కనిపించారు. ముందుకు వచ్చారు. 'సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్', 'ఫొటోగ్రాఫిక్ ఎవిడెన్స్' అంటూ ఏమిటేమిటో మాటలు వినిపించాయి.

కష్టంలో ఆదుకుని, చేరదీసి, శరణు ఇచ్చిన ఆత్మీయుని హత్యచేసిన నరరూప రాక్షసుడని సాక్ష్యాలతో బుజువైంది.

మనసులో నిర్ధారణ అయింది. 'అందుకనే జూరీలు ఏకగ్రీవంగా "దోషి" అని సమ్మతించి, శిక్షకు అర్హుడని నిర్ణయించి, నాకు ప్రసాదించిన వరం 'మరణశిక్ష'. అది ఏనాటి గాథో ?

నాటి నుంచి నేటి వరకు ఎన్ని యుగాలు గడచిపోయాయి! ఎన్ని కలలు కరిగి పోయాయి! ఎన్ని స్మృతులు దూరమయ్యాయి ?

ఈ నాలుగు సంవత్సరాల్లో తను మరచిపోయినా, సంఘం, చట్టం మరిచి పోనిది- తనకు విధింపబడిన మరణశిక్ష.

అది ఈ నాడు ఖాయం.

కొద్ది రోజుల్లోనో, కొద్ది క్షణాల్లోనో తాను మరణించబోతున్నాడంటే తనకు భయం వేయడం లేదే ? తనలో ఆందళన కలగడం లేదే ?

ఎలాగైనా ఇక్కడినుంచి పారిపోయి బ్రతకాలన్న ఆసక్తి కలగడం లేదే ?

అయినా, జీవితంలో ఏముంది ?

సింగనలాటి దొంగలు, సుశీల లాటి వేశ్యలు !

వద్దు, వద్దు. అటువంటి జీవితమే వద్దు. ఎన్నో యుగాలు గడిచాయి.

మళ్ళీ కటకటాల తలుపులు తెరుచుకున్నాయి.

జైలరు వచ్చాడు. 'డాక్టరు గారు పిలుస్తున్నారు' అన్నాడు.

డాక్టరు గారి దగ్గరకు వెళ్ళాడు. తన గుండె పరీక్ష చేశారు. తన నాడిని పరీక్ష చేశారు. తన రక్తాన్ని పరీక్ష చేశారు.

డాక్టరు తనవంక చూడకుండా జైలరుతో - "ఓ. కె. హి ఈజ్ క్వయిట్ హెల్దీ" అంటూ వెళ్ళిపోయాడు.

మహనీయులకు, మహాత్ములకు లభించే సత్కారం తనకు లభించింది.

శ్రీ కృష్ణుడికి లాగా తనను కూడా తులాభారం వేశారు.

తనకు సరిసమానంగా సత్యాదేవి సంపదలన్నీ వెయ్యలేదు; రుక్మిణీదేవి తులసి దళంతో తనని తూచలేదు.

తనకు తులాభారం ఇసుకతో.

తనకు సరిసమానమైన బరువుగల ఇసుకను ఒక పెద్ద గోనెసంచీలో పోసి, ఆ సంచీని దూలానికి కట్టిన ఒక పెద్ద తాడుతో వేలాడగట్టారు. జైలరు - 'ఓ. కే. ఇట్‌విల్ విత్ స్టాండ్' అన్నాడు.

తను ఉండబట్టలేక అడిగేశాడు. ఎందుకిదంతా ? ఆయనేమి మాట్లాడలేదు. తను మళ్ళీ తడబడుతూ అడిగాడు.

'ఈ తాడు?' ఆయన మధ్యలో అందుకుని, ఔను. దానితోనే' - అన్నాడు. ఇద్దరూ కలిసి తిరిగి వచ్చారు.

ఆయన వెళ్ళబోయే ముందు తను ఒకే ఒక ప్రశ్న వేశాడు : 'ఎప్పుడూ?'

'ఏప్రిల్ పదమూడు - శుక్రవారం'.

'అంటే?'

'నలభై ఎనిమిది గంటలు'.

ఈ భువినుంచి అమరలోకానికి సాగిపోవడానికి వ్యవధి నలభై ఎనిమిది గంటలు.

ఇంత కాలం మరిచిపోయిన ప్రపంచానికి పాపం, తను ఇప్పుడు గుర్తు వచ్చాడు కాబోలు.

తనని చూడటానికి వచ్చే వాళ్ళ సంఖ్య ఒక్కసారిగా పెరిగింది. తన గది దగ్గర అహర్నిశలు ఎవరో ఒకరు ఉంటూనే ఉన్నారు. ఇంతలోనే ఏమన్నా అఘాయిత్యం చేస్తాడని భయం కాబోలు! జైలు సూపరింటెండెంటు వచ్చాడు, తనని చూడ్డానికి.

'ఏమైనా కావాలా?' అనడిగాడు.

తనకు ... ఇంకా ఏం కావాలి ?

ఆయన అడిగిన ప్రశ్నకు తనేం సమాధానం చెప్పలేదు.

అన్ని రోజులకన్న ఈ రోజు భోజనం బాగుంది. ఒక ఖైదీని చూసినట్టు చూడలేదు. ఒక అతిథిని గౌరవించినట్టు గౌరవించారు.

మనసులో ఎంత ఆందోళన ఉన్నా శరీరం ఆదమరచి నిద్రపోయింది. అలా ఎంత సేపు నిద్రపోయాడో ఏమో ? కన్ను తెరచి చూసేసరికి ప్రపంచాన్ని అలుముకుంటున్న చీకట్లు తనకు కనిపించాయి. కాలగర్భంలో కలిసిపోతున్న సూర్యుని అంతిమ రేఖల అరుణిమను చూద్దామని ఆ గా కటకటాల దగ్గరకు వెళ్ళి నిలబడ్డాడు.

తన సవ్వడి విని ఒక కంఠం పలికింది - 'ఏం కావాలి?' అని. అప్రయత్నంగా తన నోటి వెంట వచ్చిన మాట - సూర్యుడు కావాలి'.

'రేపు పొద్దుటి దాకా ఆయన రాడు' అన్నాడు జైలరు.

అప్పుడు మనసుకి అనిపించింది - రేపు కంటికి కనిపించే వెలుగే ఆఖరి వెలుగు.

జైలరు మళ్ళీ ప్రశ్నించాడు : 'ఏమన్నా కావాలా ?'

మళ్ళీ అదే సమాధానం.

అతను ఒక్క క్షణమాగి మళ్ళీ ప్రశ్నించాడు : 'ఎవరితోనైనా ఏమైనా చెప్పాలా ?'

తను ఎవరికి ఏమి చెప్పాలి.

తనకు ఎవరున్నారని సందేశమివ్వాలి ?

"మాతా నాస్తి - పితా నాస్తి, నాస్తి బంధు సహోదరా :" కానీ, సుశీల ఉందిగా ?

సుశీలకు తనేమైనా చెప్పాలా ?

ఔను. ఎన్నో చెప్పాలి.

ఇంత జరిగినా తన మనసులో ఎందుకనో ఆ వ్యక్తిని చూస్తే ఇంకా అభిమానం !

ఒక్కసారి సుశీలని చూడగలిగితే ? ఒక్కసారి ఆమెతో మాట్లాడగలిగితే? తను అడిగేదల్లా ఒక్కటే ఒక్క ప్రశ్న - 'ఎందుకింత ద్రోహం చేశావు?' అని.

నేను నీకు చేసిన అపకారమేమిటి?'

నరకంలో నుంచి తప్పించి, స్వర్గానికి దారి చూపడమేనా తను చేసిన మహాపరాధం?

అర్హత లేని వాళ్ళని అందలా న్నెక్కించడమే తను చేసిన పెద్ద పొరబాటు.

అందుకనే అటువంటి పొరబాటు చెయ్యకుండా ఉండటం కోసమనే తనకు ఈ శిక్ష.

దూరంగా చీకటిని చీల్చుకుని ఎన్నో గంటలు, కాలం గడచిపోతూందని, బతుకు తరిగిపోతూందని, జీవితం దూరమౌతూందని, మృత్యువు చేరువవుతూందని అనుక్షణం గుర్తుకు తెచ్చే ఎన్నో గంటలు, ధ్వనులు, ప్రతిధ్వనులు, వినిపించే నిట్టూర్పులు, వినపడని హాహాకారాలు. అన్నిటి సందేశం ఒక్కటే.

చేరువవుతున్న మృత్యువును ధైర్యంగా ఆహ్వానించు. ద్వేషించే సంఘం నుంచి, ప్రేమించని వ్యక్తుల నుంచి దూరంగా తీసుకు వెళ్ళే ఈ మృత్యువును సంతోషంగా ఆహ్వానించు.

తనకు తప్పనిసరిగా స్వర్గమే. యమయాతనలన్నీ, నరకమంతా అనుభవించిన తనకు దిఙ్మండలానికి అవతల లభించేది స్వర్గమే. ఏదో నిర్లిప్తత. ఏదో ఆవేదన, ఏదో ఆత్మసంతృప్తి. ఎందుకనో, ఎందుకనో! ఈ సారి కొత్వాలు గంట ఆరుసార్లు పలికింది. జాగ్రత్తగానే విన్నాడు - ఆరు గంటలు.

దూరంగా మళ్ళీ అదే కోయిల కంఠం కుహూ కుహూ అని పిలిచింది.

మనసుకు అనిపించింది - ఇంకొక ఇరవై నాలుగు గంటలు పోనీ, నీ కన్నా నేను స్వేచ్ఛగానే ఉంటాను.

నీ కన్నా ఎత్తు నుంచి కుహూ కుహూ అని కూస్తాను.

అప్పుడు నన్నెవ్వరూ ఆపలేరు. ఎవరూ నా సంగీతం కాదనలేరు.

ఇరవై నాలుగు గంటలు. అప్పుడే కొన్ని నిమిషాలు, గడియలు తరిగి పోయాయి.

సూర్యుడు రోజుకన్నా మరింత తొందరగా పరుగెడుతున్నాడేం? ఈ దురదృష్టవంతుణ్ణి చూడకుండా పారిపోదామని వడివడిగా సాగిపోతున్నాడా?

మనస్సుకు లేని ఆకలి శరీరానికి చెప్పింది - ఏమని ? జాము పొద్దు ఎక్కిందని.

ఎంతో సేపు ఎంతో హాయిగా, ఎంతో స్వేచ్ఛగా, తనవితీరా స్నానం చేశాడు.

అప్పుడూ తన చుట్టూ అంతులేని పరివారమే.

తన కనుసన్నలలో మెలిగేవారే.

వేడివేడి భోజనం వచ్చింది. రుచిగల పదార్థాలున్నాయి.

తను భోజనం చేస్తున్నంతసేపూ అంత పెద్ద అధికారులు తన ముందు చేతులు కట్టుకుని, అప్రమత్తులై నిలబడే ఉన్నారు.

ఇంకొక పదహారు గంటలు.

మనసుకు ఒకటే సంకల్పం. అన్నీ మరచిపోవాలి. కనులు మూసుకుని నిద్రపోవాలి.

వెళ్ళిపోండి, వెళ్ళిపోండి ఇక్కడినుంచి అని తను బిగ్గరగా కేకలు పెట్టాడు.

వాళ్ళు ఆశ్చర్యపడకుండా తనవంక చూశారు.

ఎవరో వస్తున్న సవ్వడి అయింది. ఛీఫ్ వార్డెను, జైలు సూపరింటెండెంటు, జైలు డాక్టరు.

డాక్టరు తనను పరీక్ష చేశాడు. మళ్ళీ నిన్నటి మాటే. హి ఈజ్ పర్‌ఫెక్ట్‌లీ ఆల్‌రైట్.

జైలు సూపరింటెండెంటు తనకు ఒక కాగితం ఇచ్చాడు.

రాష్ట్రపతి భవనం నుంచి వచ్చిన సందేశ మది.

తన తరపున తన వకీలు పంపిన క్లెమెన్సీ పిటిషనుకు సమాధానమది.

మరణశిక్షను రద్దు చేయతగిన ప్రత్యేక కారణాలుగానీ, పరిస్థితులుగానీ లేనందున, నేరస్థుడు ఈ శిక్షకు అర్హుడేనని సాక్ష్యాధారాలు తగినంతగా ఉన్నందున సుప్రీంకోర్టు ఇంతకు మునుపు హైకోర్టు ధ్రువపరిచిన మరణశిక్షను ఖాయపరచడమైనది.

జైలరు ఏం మాట్లాడలేదు. తనూ ఏం మాట్లాడలేదు.

ఛీఫ్ వార్డెనుతో తను నెమ్మదిగా, 'సుశీలకు కబురు పంపగలరా?' అని అన్నాడు.

ఆయనేం మాట్లాడలేదు.

డాక్టరుగారు మాత్రం - 'ఎవరికైనా ఉత్తరం రాయదలుచుకుంటే రాయండి. పంపిస్తాం' అన్నారు.

అక్కడ అందరూ ఉన్నా తను మాత్రం ఒంటరిగానే ఉన్నాడు ఎన్నో ఉత్తరాలు వ్రాద్దామనిపించింది.

సంసారబాధ్యత విస్మరించి తన స్వార్థమే సమస్తమనుకుని, తనని, తనవారిని సర్వనాశనం చేసిన ఆ జూదరి తండ్రికి ఉత్తరం వ్రాద్దామనిపించింది. తండ్రికన్నా పదిరెట్లు పాపం చేసి తనకు అంతులేని అపకారం చేసిన తల్లికి వ్రాద్దామనిపించింది.

మురికి కూపంలో, బురదగుంటలో క్రుంగి కృశిస్తూ, తన చేయూతతో మళ్ళీ మనిషిగా మారి, అదృష్టం ఆమడదూరమైతే, తనకే అంతులేని అపకారం తలబెట్టిన ఆ సుశీలకు వ్రాద్దామనిపించింది. 'సర్కంస్టాన్షియల్ ఎవిడెన్స్' 'ఫొటోగ్రాఫిక్ ఎవిడెన్సు' అంటూ తనని పూర్తిగా అర్థం చేసుకోకుండా తన మాటలు అర్థం చేసుకోకుండా, తనని దోషిగా నిర్ణయించి, మరణశిక్ష విధించిన జూరీ మెంబర్లకు, డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జికి వ్రాద్దామనిపించింది.

ఈ నాలుగు సంవత్సరాలుగా తనకు ఎలాగైనా విముక్తి కలిగించాలని రేయింబవలు కష్టపడిన వకీలుగారికి వ్రాద్దామనిపించింది.

తన బ్రతుకు బండలు చేసి బందిపోటుగా మార్చిన సింగన దొరకు వ్రాద్దామనిపించింది.

మనసు ఒక్కసారి గర్జించింది. ఇంత అశాంతిలోను ఏదో నిర్లిప్తత, ఏదో నిస్తబ్దత.

తను బిగ్గరగా అన్నాడు - 'నన్ను మరచిపోనివ్వండి. మరచిపోనివ్వండి'.

తన వంక ఆశ్చర్యంగా జైలు సూపరింటెండెంటు, వార్డెను చూస్తున్నారు.

డాక్టరు నెమ్మదిగా - 'నిదురపోవడానికి ఇంజెక్షనివ్వనా?' అనడిగాడు.

సూపరింటెండెంటు కంఠం వారిస్తూ - 'డాక్టర్!' అన్నది.

డాక్టరేం మాట్లాడలేదు. బయటకు వెళ్ళిపోయాడు.

ఇద్దరి మధ్య మాట్లాడడానికి మాటల్లేవు. ఇద్దరిది తలో ప్రపంచం; తలో ఆలోచన.

అలా ఎంత సేపు గడచిందో?

ఛీఫ్ వార్డెను వెంట ఎవరో వచ్చారు. ఆ మనిషిని చూడగానే అప్రయత్నంగా తను నమస్కారం చేశాడు. ఎంతో స్ఫురద్రూపి. ముఖంలో కొట్టవచ్చే ఆ వర్చస్సు. ఆయన్ని చూడగానే ఏదో ప్రశాంతత.

అంతా వెళ్ళిపోయారు. తామిద్దరే మిగిలారు.

ఆయన 'ఫాదర్ వెంచూరియన్‌ని ' అని అన్నారు.

నేను మూడువందల తొంభై మూడుని.

ఆయన చేతిలోని బైబిలు, మెడలోని సిలువ తనని ఒక్కక్షణం ఆకర్షించాయి.

తను ఆయన వంక చూసి, 'కూర్చోండి' అని మర్యాద చేశాడు.

'నువ్వు కూడా కూర్చో, నాయనా' అని ఆయన బదులు పలికాడు.

కొద్ది క్షణాలు ఇద్దరి మధ్య మౌనం.

కొద్ది క్షణాలు అంతా నిశ్శబ్దం.

'భగవంతుని ప్రార్థించు. మనసు తేలిక అవుతుంది'.

'ఎందుకని? ఎందుకు ప్రార్థించాలి?'

'ఆయన జగద్రక్షకుడు కనక'.

'ఇంత అశాంతి, ఇంత ద్వేషం, ఇంత అన్యాయం జరుగుతున్నా, చూస్తూ సహించి ఊరుకున్న ఆయన జగద్రక్షకుడేమిటి?

'దైవమే ఉంటే ఇంత దుఃఖమెందుకుంటుంది? ఇంత బాధ ఎందుకుంటుంది?'

ఆయన ముఖంలో మందహాసం కనిపించింది.

'సుఖం విలువ తెలుసుకోవాలనే ఇంత దుఃఖాన్ని సృష్టించాడు మానవులకు'.

'మరి అన్యాయం? మరి ద్వేషం?'

'రాక్షసుడు మానవుడు గాను, మానవుడు దేవతగాను, దేవత దైవంగాను ప్రగతి పొందడం కోసమని ఈ అరిష్టాలను సృష్టించాడు భగవంతుడు' అన్నాడు.

తను పెద్ద పెట్టున నవ్వాడు.

ఆయన నవ్వలేదు.

'తను సృష్టించిన మానవ జీవితాలతో చెలగాటమాడటం ఆయనకుసరదా?'

'గమ్యం చేరడానికి ప్రయత్నం చేసే వారికి చేయూత నివ్వడమే ఆయనకు లక్ష్యం'.

'వెళ్ళండి, ఫాదర్. నాకు చాలా పని ఉంది. నా కాలం చాలా అమూల్యం.

అస్తమించే సూర్యుణ్ణి నేను మళ్ళీ ఎప్పటికి చూడలేను.

ఉదయించే చంద్రుడు నాకు మళ్ళీ కనిపించడేమో?

నన్ను చూడనివ్వండి. నేను వెళ్ళే లోకంలో సూర్యచంద్రులుంటారో, లేదో? ఈ అందమైన ఆకాశముంటుందో లేదో! మిల మిల మెరిసే ఈ లక్షలాది నక్షత్రాలుంటాయో, లేదో! నన్ను చూడనివ్వండి'.

'కంటితో కాదు, మనసుతో చూడు, ఏం కనిపిస్తుంది?

అంతులేని ప్రశాంతత. అనన్యమైన ఆనందం!

తనకు అంతులేని కోపం కలిగింది.

'అంత ప్రశాంతత, అనన్యమైన ఆనందం ఉంటే మీరక్కడికి వెళ్ళలేదేం? ఇంకా ఇక్కడే ఉన్నారేం?' అని కర్కశంగా అన్నాడు.

ఆయనలోని చిరునవ్వు మారలేదు. చిద్విలాసం మారలేదు.

'దేనికైనా ప్రభువు ఆజ్ఞ కావాలి. దైవం సంకల్పించాలి'.

సూర్యుడు ఎప్పుడో అస్తమించాడు.

ఎంతసేపు ఎదురుచూసినా చందమామ రాలేదు. 'ఎందుకని?' అని తను ప్రశ్నించాడు.

'ఈ రోజు అమావాస్య' అని సమాధానం వచ్చింది.

'చందమామని చూడకుండానే వెళ్ళి పోతున్నాను'?

మనస్సుకు బాధ కలిగింది. కాలం నిలిచిపోయినట్టనిపించింది. కానీ, కాలం నడుస్తూనే ఉంది.

దూరంగా ఎక్కడో గంటలు.

ఎన్ని గంటలు? ఎన్ని గంటలో! లెక్క తెలియటం లేదు. కానీ, తెలిసిందల్లా ఆ గంటలు తను మళ్ళీ వినలేనని.

చీకటి రాత్రిలో ఎక్కడో గుడ్లగూబ అరుపు.

తీతువుపిట్ట పిలుపు. చేరువవుతున్న పద ధ్వనులు.

ఒకరు కాదు, ఇద్దరు కాదు, పరివారం.

వాళ్ళు తనని ప్రశ్నింపలేదు. తనే ప్రశ్నించాడు.

'సమయం అయిందా?'

'ఔను అన్నట్టు తల ఊపారు.

ఒక్కసారి గదంతా కలియచూసాడు. మనస్సు ఒక్క క్షణం భయంతో కంపించింది.

ముందుకు సాగిన పాదం తడబడింది.

'కరేజ్, మై బాయ్! కరేజ్!' అని ఫాదర్ కంఠం పలికింది.

ఎవనిదో చేయి తనకు ఆసరా ఇచ్చింది.

జగన్నాథుని రథచక్రాలు కదిలాయి. మహాప్రస్థానం ప్రారంభమైంది. క్షణికమైన భయం దూరమైంది. అంతులేని ధైర్యం ఆవరించుకుంది.

రత్నఖచిత సింహాసనం అలంకరించబడింది.

సామంతులతో తరలిపోయే చక్రవర్తిలాగా, అప్సరసల నృత్యం తిలకించడానికి తరలిపోయే ఇంద్రుడి లాగా, తేలికైన మనసుతో ముందుకు వడివడిగా సాగిపోయాడు.

సింహాసనం ఎదురుచూస్తూంది. దర్బారు కిటకిట లాడుతూంది.

ఎందరా, ఎందరా అని లెక్కించి చూస్తే, ఉన్నది ఆరుగురు.

నెమలి సింహాసనానికి మెట్లెన్ని ?

ఆ ఆరుగురిలో ఒక వ్యక్తి - నల్లకోటు, తెల్ల కాలరు చెప్పకుండానే తెలుస్తోంది.

తన వైపు తిరిగి 'రఘూ!' అని పిలిచినట్టుగా కాదు, తనని వినమన్నట్టు పిలిచాడు.

'1965వ సంవత్సరం మే నెల 16వ తారీఖు అర్ధరాత్రి రెండు గంటలకు అంతవరకు నీకు ఆశ్రయమిచ్చి ఆదరించిన చంద్రశేఖరావుని దుర్మార్గపు ఆలోచనతో అతని ఆస్తిని కాజేద్దామనే కోరికతో అతనిని నువ్వు కుట్రపన్ని హత్య చేసినట్టు నీపై ఆరోపించబడిన నేరం ఋజువు కాగా సెషన్సుజడ్జి విధించిన మరణశిక్షను హైకోర్టువారు ధ్రువపరిచారు. సుప్రీంకోర్టువారు ఖాయపరిచారు.

దయ చూపమని, శిక్షను తగ్గించవలసిందని రాష్ట్రపతికి నువ్వు పంపిన అర్జీ కూడా తిరస్కరించడమైంది.

సెక్షన్ 302 ఐ.పి.సి. నీకు విధించబడిన ఈ శిక్షను కొద్ది క్షణాల్లో అమలు పరచబోతున్నాం.

తను ఏం మాట్లాడలేదు. ఈ విషయంలో తనకేం సబంధం లేనట్టు అన్యమనస్కుడై వింటున్నాడు.

వారందరి వంక ఒక్కసారి చూశాడు.

జైలు సూపరింటెండెంటు, ఛీఫ్ వార్డెను, డాక్టరు, మాజిస్ట్రేటు, సింహాసనం మీద తనకోసం వేచి ఉన్న ఆ వ్యక్తి - అందరి వంక చూశాడు.

ఏదో చెబుదామనుకున్నాడు. మనస్సు పదేపదే హెచ్చరించింది. ధైర్యంగా ఉండాలి.

ఎవరో తన చెయ్యి పుచ్చుకున్నారు. తన వెంట నడిచారు.

ఒక్కొక్కటే... ఒకటి... రెండు... మూడు... హమ్మయ్యా... లెక్క తేలింది... నెమలి సింహాసనానికి మెట్లు పదమూడు.

కన్నెత్తి పైకి చూశాడు. తనను సరాసరి స్వర్గానికి తీసుకు వెళ్ళే సాధనం ఎదురుగా కనిపిస్తోంది.

వెనక్కి తిరిగి ఒక్కసారి చూశాడు. గంభీరమైన వదనాలు, ఫాదర్ వెంచూరియన్ కళ్ళు చెపుతున్నాయి. తనతో - 'కరేజ్, మై బాయ్! కరేజ్ !'

ఆలోచనకి అంతరాయం కలిగింది. రెండు కాళ్ళని దగ్గరికి చేర్చి బంధించి వేస్తున్నారు, తోలు పటకాలతో.

చేతులు వెనక్కి విరిచి తాళ్ళతో కట్టివేస్తున్నారు.

ప్రపంచం తనకి కనిపించకుండానే నల్లటి ముసుగు.

దూరంగా గంటలు కొట్టిన శబ్దం.

ఈ సారి లెక్క తెలిసింది - నాలుగు గంటలు.

కాలపాశం కంఠానికి తగిలింది. యమదూతలు ఎదురుగా నిలిచారు. ముడి బిగుసుకొని పోతూంది.

ప్రపంచానికి వినిపించిన ఆఖరి మాటలు - 'మీ ఎవ్వరి మీద నాకు కోపం లేదు... మీ ఎవ్వరిమీద నాకు కోపం లేదు...